## క్లుప్తంగా

### మురుగు తొలగింపు



మురుగు నీటిని తొలగిస్తున్న అధికారులు

సాక్షి స్పందన

లక్ష్మణచాంద: మండలంలోని పీచర గ్రామంలో ఎస్సీ కాలనీ ఎదుట ప్రధాన రోడ్డుపై నిలిచి అపరిశుభ్రంగా మారింది. దీంతో సాక్షిలో గత నెల 30న మురుగు తొలగించరూ శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన మండల పంచాయతీ అధికారి అమీర్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శి రాకేశ్ బుధవారం మురుగుకాల్వను శుభ్రం చేయించారు.

### మాంసం విక్రయించొద్దు

నిర్మల్‌టౌన్: ఈనెల 2న గాంధీజయంతి సందర్భంగా పట్టణంలో చేపలు, మేకలు, కోళ్లను తదితర జంతువులను వధించరాదని మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎవరైనా మాంసం విక్రయిస్తే మున్సిపల్ చట్టం–2019 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

### బతుకమ్మ గ్రూపులకు విరాళం



విరాళం అందుకున్న గ్రూప్ సభ్యులు

లక్ష్మణచాంద: మండలకేంద్రంలో బతుకమ్మ ఆడిన గ్రూపులకు బుధవారం తన తండ్రి, మాజీ డిప్యూటీ స్పీకర్ అయిండ్ల భీమ్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన తనయుడు అయిండ్ల చంద్రమోహన్‌రెడ్డి రూ.లక్ష ఇరవై వేలను విరాళంగా అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముత్యంరెడ్డి, నాయకులు ఓసరాజు, సిడుగు భీమ్‌రెడ్డి తదితరులున్నారు.

### తనిఖీలు ముమ్మరం




వాహనం తనిఖీ చేస్తున్న ఏఎస్సై శంకర్

నర్సాపూర్(జి): మండలకేంద్రంలోని 61వ జాతీయ రహదారిపై బుధవారం పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పరిమితికి మించి డబ్బుతో వెళ్లడం, మద్యం రవాణాపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. కార్లు, బైకులు, ఇతర వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. రూ.50 వేలకు మించి నగదుతో వెళ్తే పత్రాలు, రసీదులు, డాక్యుమెంట్లు ఉండాలని పోలీసులు సూచించారు. తనిఖీల్లో ఏఎస్సై శంకర్, కానిస్టేబుళ్లు సంజీవ్, రజిత, వినీత పాల్గొన్నారు.



# ఇక్కడ మద్యం ముట్టరు ..



ఝురి(బి) గ్రామం

- ఆదర్శంగా ఝురి(బి) గ్రామం
- 14 ఏళ్లుగా కట్టుబాటు పాటిస్తున్న ప్రజలు

తానూరు: జిల్లాలోనే మారుమూల ప్రాంతమైన తానూరు మండలం ఝురి(బి) గ్రామంలో ప్రజలు 14ఏళ్లుగా మద్యానికి దూరం ఉంటున్నారు. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో తానూరు మండలకేంద్రానికి 14 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామంలో మహారాష్ట్ర సంప్రదాయాలు కొనసాగిస్తున్నారు. ఈ గ్రామ ప్రజలు చెడు వ్యసనాలకు దూరం ఉంటూ ఆధ్యాత్మిక బాటలో నడుస్తున్నారు. ప్రతి ఆదివారం బాలకేంద్రం స్వాధ్యాయ ద్వారా భక్తి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

**ఏకతాటిపై నిలిచిన గ్రామస్తులు..**

14 ఏళ్ల కిందట మద్యానికి బానిసైన గ్రామ యువకులు ఇంటి బాగోగులు పట్టించుకోకుండా జులాయిగా తిరిగేవారు. మరికొందరు కుటుంబాన్ని పోషించక ఆత్మహత్యలు చేసుకున్నారు. దీంతో పెద్దదిక్కును కోల్పోయిన బాధిత కుటుంబాలు ఆర్థికంగా, మానసికంగా చితికిపోయి రోడ్డున పడ్డాయి. వారి పిల్లలు చదువులకు దూరమయ్యారు. ఇదంతా గమనించిన గ్రామస్తులంతా ఏకతాటిపై నిలబడి గ్రామంలో మద్యపానం నిషేధం అమలు చేయాలని నిర్ణయించారు. వీరికి స్వయం సహాయక సంఘాల మహిళలు సైతం అండగా నిలిచారు. గ్రామపెద్దల సమక్షంలో మద్యపాన నిషేధం అమలు చేస్తూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. దీనికి పోలీసులు సహకారం అందించారు.

**ఉల్లంఘిస్తే జరిమానాలు..**

అప్పటి నుంచి గ్రామంలో నిబంధనలు ఉల్లంఘించి ఎవరైనా మద్యం తాగితే జరిమానాలు విధిస్తున్నారు. గ్రామంలో మద్యపాన నిషేధం చేసినప్పటి నుంచి గ్రామంలో ఎలాంటి అల్లర్లు జరగడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ప్రశాంతంగా ఐకమత్యంతో జీవిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. వివిధ అంశాలోల భిన్నభిప్రాయాలు ఉన్నప్పటికీ మద్యం కట్టుబాటు విషయంలో మాత్రం గ్రామస్తులంతా ఏకతాటిపైనే ఉంటున్నారు. 1273 జనాభా కల్గిన ఈ గ్రామంలో నిబంధన ఉల్లంఘించిన వ్యక్తికి రూ.ఐదు వేలు జరిమానా విధిస్తున్నట్లు గ్రామస్తులు చెప్పుకొచ్చారు.

**సమష్టి నిర్ణయమిది**



గ్రామంలో మద్యాన్ని బహిష్కరించినప్పటి నుంచి ఎలాంటి సంఘటనలు జరగడం లేదు. యువకులు స్వాధ్యాయ కార్యక్రమంలో పాల్గొంటూ భక్తిబాటలో నడుస్తున్నారు. గ్రామస్తులు సమష్టిగా తీసుకున్న నిర్ణయమిది. ప్రస్తుతం అందరం సంతోషంగా ఉంటున్నాం.

– శంకర్‌పటేల్, గ్రామస్తుడు

**చెడుకు దూరమవుతున్నారు**



మా గ్రామంలో 14 ఏళ్ల కిందటి నుంచి మద్యం నిషేధించారు. అప్పటి నుంచి గ్రామంలో మద్యం అమ్మకాలు జరగడం లేదు. యువకులు చెడు వ్యసనాలకు దూరం ఉంటూ భక్తి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. కొందరు ఉన్నత చదవులు చదువుతున్నారు. భక్తి మార్గం వైపు అడుగులు వేయాలన్నదే మా లక్ష్యం.

– దేవిదాస్, గ్రామస్తుడు

## గట్టు మైసమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసాటౌన్: పట్టణంలోని కిసాన్‌గల్లి గట్టు మైసమ్మ ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ ఆలయాన్ని సందర్శించారు. ఈ మేరకు ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు తీర్థప్రసాదం అందజేశారు. అలాగే శాలువాతో సన్మానించారు. అంతకుముందు పట్టణంలోని తన నివాసంలో ముధోల్ మండలం ఎడ్‌బిడ్‌కు చెందిన భూమేశ్‌కు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేశారు. ఆయన వెంట బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

**బాధిత కుటుంబానికి పరామర్శ**

భైంసారూరల్: ఇటీవల కురిసిన భారీవర్షాలకు మండలంలోని బిజ్జూర్ గ్రామానికి చెందిన గంటోళ్ల లక్ష్మి వాగులో కొట్టుకుపోయి మృతిచెందింది. బాధిత కుటుంబాన్ని బుధవారం ఎమ్మెల్యే రామారావు పటేల్ పరామర్శించారు.

## ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

- ముధోల్ సీఐ మల్లేశ్



తానూరులో మాట్లాడుతున్న సీఐ మల్లేశ్

తానూరు: స్థానిక ఎన్నికల కోడ్ ఉలంఘించిన వారిపై చర్యలు తప్పవని ముధోల్ సీఐ మల్లేశ్ పేర్కొన్నారు. బుధవారం మండలకేంద్రంలోని ఆయా పార్టీల కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో అభ్యర్థుల కోసం గొడవలకు దిగి పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరగవద్దని రాజకీయ పార్టీల నాయకులకు సూచించారు. ఎవరైనా ప్రలోభాలకు గురి చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. గ్రామాల్లో దుర్గాదేవి శోభాయాత్రలు ప్రశాంతగా నిర్వహించుకోవాలన్నారు. వాట్సాప్‌లో విద్వేష పోస్టులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై షేక్ జుబేర్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఉత్తం బాలేరావ్, నాయకులు విఠల్ తదితరులు పాల్గొన్నారు.

**సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి ..**

దొంగతనాల నివారణకు వీడీసీ, దుకాణ సముదాయాల యజమానులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సీఐ మల్లేశ్ పేర్కొన్నారు. తానూరు పంచాయతీ కార్యాలయంలో దుకాణస ముదాయాల యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పక్షం రోజులుగా తానూరులోని దుకాణాల్లో వరుసగా చోరీలు జరుగుతున్నాయని.. సీసీ కెమెరాలు ఉంటే ఫుటేజీల సాయంతో దుండగులను పట్టుకునేందుకు పోలీసులకు సులభమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

## సమాజాభివృద్ధికి ఆర్ఎస్ఎస్ కృషి



కుభీర్ : పల్సిలో సమావేశమైన స్వయం సేవకులు

కుభీర్: సమాజాభివృద్ధికి ఆర్ఎస్ఎస్(రాష్ట్రీయ స్వయం సేవక్) కృషి చేస్తోందని జిల్లా కార్యకారణి సభ్యులు సరికొండ దామోదర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పల్సి గ్రామంలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువులను ఐక్యం చేసేందుకు 1925లో విజయదశమి రోజున ఆర్ఎస్ఎస్‌ను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్‌కు అనుబంధంగా ఏబీవీపీ, వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్, హిందు వాహిని, విద్యాపీఠం, సేవా భారతి, ప్రజ్ఞభారతి, కిసాన్‌సంఘ్, భారతీయ మజ్దూర్ సంఘ్ వంటి 44 సంస్థలు పనిచేస్తున్నట్లు వివరించారు. ఖండ సహ కార్యవాహ పోశెట్టి, ఖండ బౌద్ధిక్ ప్రముఖ్ శ్రీనివాస్, తోకల రాములు, ధర్మపురి, రమేశ్, రాములు తదితరులు ఉన్నారు.

**ఐక్యంగా ఉండి దేశభక్తి చాటాలి**

కుంటాల: ప్రజలంతా ఐక్యంగా ఉండి దేశభక్తి చాటాలని ఆర్ఎస్ఎస్ జిల్లా సహకార్యవాహ ఉప్పు అరుణ్ పేర్కొన్నారు. మండలంలోని అందకూర్, వెంకూర్, లింబా(కె),అంబకంటి, గ్రామాల్లో ఆర్ఎస్ఎస్ దశాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. హిందువులంతా దేశ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. స్వయం సేవకులు గ్రామాల్లో పథసంచలన్ చేపట్టారు. కార్యక్రమంలో వక్తలు నాగమణి లింగన్న, వంగల సుధాకర్, కొత్తకాపు నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## దుర్గాదేవికి పూజలు

దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం దుర్గాదేవి మండపాల వద్ద భక్తులు పూజలు, అభిషేకాలు, హోమం నిర్వహించారు. ఖానాపూర్ పట్టణంతోపాటు మండలంలోని గ్రామాల్లో దుర్గాదేవి నిమజ్జనం నిర్వహించారు. ఈసందర్భంగా శోభాయాత్రలో కోలాటం, నృత్యాలు అలరించాయి.

– సాక్షి నెట్‌వర్క్



భైంసారూరల్: వాలేగాంలో..



కుంటాల: సూర్యాపూర్‌లో..



కుభీర్: జామ్‌గాంలో హారతి కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



తానూరులో దుర్గాదేవి మండపం వద్ద హోమంలో పాల్గొన్న భక్తులు



ఖానాపూర్‌లో అమ్మవారి శోభాయాత్రలో నృత్యం చేస్తున్న మహిళలు

## నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలి

కుంటాల: ఎన్నికల నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలని ఎంపీడీవో, జిల్లా అదనపు ఎన్నికల అధికారిణి అల్లాడి వనజ సూచించారు. బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు ఏర్పాటు చేయకుండా చూడాలని ఆదేశించారు. మత్తు పదార్థాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కమల్‌సింగ్ పేర్కొన్నారు. సమావేశంలో ఎస్సై అశోక్, ఎంపీవో ఎంఏ రహీంఖాన్, డీటీ రాకేశ్, ఏపీవో గట్టుపల్లి నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.

### దసరా ఏర్పాట్లు



రావణుని ప్రతిమ ఏర్పాటు చేస్తున్న నాయకులు

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోగల రాంలీలా మైదానంలో గురువారం నిర్వహించనున్న దసరా ఉత్సవాలకు హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నాయకులు ఏర్పాట్లు చేశారు. రావణ వధలో భాగంగా ఏర్పాటు చేస్తున్న ప్రతిమలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు అన్నీ సిద్ధం చేశారు.

### బతుకమ్మ వేడుకలు



కుంటాల: మండలంలోని కల్లూరులో గురువారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. అంటూ ఆడిపాడారు. అనంతరం నిమజ్జనానికి తరలించారు.

### ఈ కేవైసీ చేయించుకోవాలి

తానూరు: ఉపాధి కూలీలు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఈజీఎస్ ఏపీవో శివలింగయ్య సూచించారు. బుధవారం మండలంలోని బెల్‌తరోడాలో ఉపాధిహామీ సిబ్బంది చేపట్టిన ఈ కేవైసీ ప్రక్రియను పరిశీలించారు. ఈకేవైసీ నమోదు చేయని కూలీలకు పనులు చేసినా.. గైర్హాజరుగా నమోదవుతుందని.. పనుల నిమిత్తం ఇతర గ్రామాలకు వెళ్లిన వారు వచ్చి ఈ కేవైసీ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీఏ రమణగౌడ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

### అటెన్షన్ ప్లీజ్.. మలుపు వద్ద హెచ్చరిక బోర్డేది?



తానూరు: ముధోల్ ఎక్స్‌రోడ్డు నుంచి దౌలతాబాద్ గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు మార్గంలో వంతెన వద్ద మూల మలుపు ప్రమాదకరంగా మారింది. ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి మలుపు వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: సునీల్, ఆర్‌అండ్‌బీ డీఈ, ఫోన్: 84649 60600

## సంక్షిప్త వార్తలు

**నేడు భూమిపూజ**

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని బాగులవాడలో గురువారం శ్రీ సరస్వతి శిశు మందిర్ భవన పునర్నిర్మాణ భూమిపూజ మహోత్సవం నిర్వహించనున్నట్లు శిశుమందిర్ పూర్వ విద్యార్థి పరిషత్ సభ్యులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రాంత సంఘటన కార్యదర్శి పతకమూరి శ్రీనివాస్ రావు హాజరవుతారని.. పూర్వ విద్యార్థులు, ఆచార్యులు రావాలని కోరారు.

**ప్రొసీడింగ్ అందజేత**

ముధోల్: అభివృద్ధికి ఎమ్మెల్యే రామారావుపటేల్ పెద్దపీట వేస్తున్నట్లు ముధోల్ మండల బీజేపీ అధ్యక్షులు కోరి పోతన్న అన్నారు. మండలంలోని గన్నోరా, రువ్వి, శెట్టిపల్లి చెరువులకు ఎమ్మెల్యే రూ.66లక్షలు మంజూరు చేశారని పేర్కొన్నారు. ఈసందర్భంగా నాయకులు ప్రొసీడింగ్ అందజేశారు. పీఏసీఎస్ డైరెక్టర్ సుదర్శన్, భూమేశ్, రమేశ్, సతీశ్ రెడ్డి, మోహన్‌యాదవ్ తదితరులున్నారు.

**ముగిసిన పోటీలు**

లోకేశ్వరం: మండలంలోని గొడిసెరాలో జీపీఎల్ ప్రీమియం లీగ్ క్రికెట్ పోటీలు బుధవారం ముగిశాయి. ఫైనల్‌లో విజేతగా నిలిచిన అశోక్ జట్టుకు రూ.10 వేలను గైని శ్రీనివాస్ అందించగా.. ద్వితీయ బహుమతి కింద నరేశ్ జట్టుకు రూ.6వేలను మాజీ ఎంపీటీసీ దత్తుపటేల్ అందజేశారు. సాయినాథ్, నరేశ్, రాజేందర్‌రెడ్డి, కెప్టెను ఉన్నారు.

**సేవాలాల్ ఆలయ కమిటీ ఎన్నిక**

కడెం: మండలంలోని చిన్నబెల్లాల్‌తండాలో సేవాలాల్ ఆలయ కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నునావత్ రవీందర్, ఉపాధ్యక్షుడిగా పాల్యా శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం కార్యవర్గాన్ని సన్మానించారు. నునావత్ తిరుపతినాయక్, నరేందర్, పరుశురాం, గంగాధర్, తిరుపతి, రాజేశ్, శేషు, సురేందర్, సురేశ్ ఉన్నారు.

### విజయదశమి వెలుగు నింపాలి



వాహన పూజ చేస్తున్న ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: విజయదశమి పండగ అందరి జీవితాల్లో వెలుగు నింపాలని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని తన నివాసంలో బుధవారం ఆయుధ పూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలు మన సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతిరూపాలని పేర్కొన్నారు. ఈ విజయదశమి అష్టైశ్వర్యాలు, ఆరోగ్యం ప్రసాదించాలని ఆకాంక్షించారు. అనంతరం జిల్లా ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అల్లోల మురళీధర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, వెంకటరామ్‌రెడ్డి, భూమేశ్, శ్రీకాంత్ యాదవ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు



మరమ్మతులు చేయిస్తున్న నందన్ గ్రామస్తులు

నర్సాపూర్(జి): ఇటీవల కురిసిన భారీవర్షాలకు మండలంలోని నందన్ ఎక్స్ రోడ్డు వద్ద బీటీ రోడ్డుకు గుంతలు పడి బురదమయంగా మారింది. దీంతో నందన్, బామ్ని, అంబకంటి గ్రామాలకు వెళ్లే వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం సామాజిక బాధ్యతతో నందన్ గ్రామస్తులు రోడ్డుపై మొరం వేయించి జేసీబీ సాయంతో గుంతలు పూడ్చి మరమ్మతులు చేపట్టారు. కూన రవికుమార్, అవర్గ సాయన్న, వెంకట్ రావు పటేల్, సురేశ్, బంగ్లా సాయన్న, నీలకంఠ రావు, భూమేశ్, సాయినాథ్ పటేల్‌కు వాహనదారులు కృతజ్ఞతలు తెలిపారు.

## 'కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పాలి'

లోకేశ్వరం: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించి.. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు బుద్ధి చెప్పాలని ఉమ్మడి జిల్లా జెడ్పీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకులు లోలం శ్యాంసుందర్ అన్నారు. బుధవారం మండలంలోని పిప్రిలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు విలాస్ గాదెవార్, డాక్టర్ కిరణ్ కొమ్రెవార్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ శ్యాంసుందర్, దత్తు, దిగంబర్, ప్రశాంత్, రహీంపటేల్, ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

### ఆలయ ఈవోకు సన్మానం

బాసర: నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బాసర దేవాలయంలో ధర్మాబాద్‌కు చెందిన వ్యాపార వర్తక సంఘం ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఇందుకు సహకరించిన ఆలయ ఈవో అంజనాదేవిని బుధవారం వ్యాపారవేత్త పంపట్వార్ లక్ష్మీకాంత్, మమ్మాయి గంగాధర్, మనోహర్‌రావు శాలువాతో సన్మానించారు. ఈవో మాట్లాడుతూ భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ సిబ్బంది, అధికారులు గ్రామస్తులు ఏర్పాట్లు చేసి సహకరించారన్నారు. వృద్ధులు, చిన్నారులకు దేవస్థానం తరపున రోజు పాలు ఇవ్వగా, దాతలు గాడిపుర జగదీశ్ మహరాజ్ అన్నదానం, నిజామాబాద్ జిల్లాలోని మనోరమ ఆసుపత్రి తరపున భక్తులకు పండ్లు పంపిణీ చేసినట్లు ఈవో పేర్కొన్నారు.

### కొండుకూర్‌లో..

కడెం: మండలంలోని కొండుకూర్ గ్రామానికి చెందిన డొంగూరి మహేశ్ ఇటీవల గ్రూప్–2 ఫలితాల్లో ప్రతిభ కనబరిచి డిప్యూటి తహసీల్దార్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. బుధవారం మహేశ్‌ను కొండుకూర్ పంచాయతీ కార్యాయంలో గ్రామస్తులు శాలువతో సన్మానించి అభినందించారు.